క్లుప్తంగా

పేదలు ఉన్నత విద్యావంతులు కావాలి



నితిన్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న హరికృష్ణ

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో పేదలు ఉన్నత విద్యావంతులు కావాలని రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పొలిమేర హరికృష్ణ అన్నారు. పదో తరగతి పరీక్షలు ఉత్తమ మార్కులు సాధించిన ఏలూరులో చర్మకార కుటుంబానికి చెందిన తగరపు నితిన్ గురువారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు ఇచ్చే అమూల్యమైన కానుక విద్య అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో పేదల ఎంతో లబ్ధి పొందుతున్నారని కొనియాడారు. అణగారిన వర్గాల పేదలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నత చదువులతో విద్యావంతులు కావాలన్నారు.

29న వలంటీర్లకు సత్కారం

ఏలూరు రూరల్: ఏలూరు మండల వలంటీర్లకు ఈ నెల 29న సత్కార కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటలకు స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు. సుమారు 300 మంది వలంటీర్లు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు హాజరవుతారని వివరించారు.

విధుల్లోకి చేర్చుకోవాలంటూ నిరసన

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న వ్యక్తిని విధుల్లో నుంచి తొలగించారని తనకు మళ్లీ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ నిరసన తెలిపాడు. ఆర్‌ఆర్‌పేట నగరపాలక సంస్థ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే స్పందించిన ఏలూరు టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఏలూరు చాణిక్యపురికాలనీ 2వ రోడ్డు ఏటిగట్టు ప్రాంతానికి చెందిన డి.సూరిబాబు ఏలూరు నగరపాలక సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా వాటర్ ట్యాంక్ వద్ద పనిచేస్తూ ఉంటేవాడు. ఇటీవల అతను అనారోగ్యంతో విధులకు హాజరుకాకపోవడంతో అధికారులు అతన్ని విధుల నుంచి తప్పించారు. తనను మళ్లీ ఉద్యోగంలో చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి ఆర్‌ఆర్‌పేట వాటర్ ట్యాంక్ వద్ద ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగాడు.


వహ్వా.. టేస్ట్ అదుర్స్..

- వినూత్న వంటకాలపై ప్రజల ఆసక్తి
- ఆధునిక హంగులతో రెస్టారెంట్లు
- ఆహార ప్రియులను ఆకర్షిస్తున్న దాబాలు

ఏలూరు టౌన్: నేటి ఆధునిక సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులు డిమాండ్ పెరిగింది. కరోనా అనంతరం ప్రజలు ఆహారంపై మరింత శ్రద్ధ చూపిస్తున్నారు. ఇక యువత సైతం లేటెస్ట్ ట్రెండ్‌ను ఫాలో అవుతూ ఆధునిక హంగులతో రెస్టారెంట్లు, దాబాలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో పెద్ద నగరాల్లో మాత్రమే కనిపించే ట్రెండ్‌ను ఏలూరు నగరానికి పరిచయం చేస్తున్నారు. ఔరా... అనిపించేలా ఆహార ప్రియులను ఆకర్షించేలా రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నారు. ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో వినూత్న రీతిలో ఆధునిక సౌకర్యాలు.... టేస్టీ.. టేస్టీ... రుచులతో ఆకట్టుకుంటున్నారు. ఏలూరు నగరంలో మన్నత్ దాబా రెస్టారెంట్, ఫుడ్ ఇంజినీర్స్ , క్రిగో, లవ్ బిర్యానీ, జీ-3, ఇలా రకరకాల ఆకట్టుకునే పేర్లతో లేటెస్ట్ ట్రెండ్‌ను సెట్ చేస్తున్నారు. ఒకవైపు యువతకు ఉపాధి లభిస్తుండగా, మరోవైపు ఆహార ప్రియులకు నోరూరించే వంటకాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో విజయవాడ, గుంటూరు ,వైజాగ్, హైదరాబాద్ వంటి నగరాలకు వెళితేగాని దొరకని అన్ని రుచులు ఇప్పుడు ఏలూరులోనే అందుబాటులోకి వచ్చాయి.

ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ

గత రెండు, మూడేళ్లుగా జనానికి ఆహారంపై ఆసక్తి, ప్రత్యేక శ్రద్ధ ఏర్పడింది. ఒక వైపు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామాలు, యోగా చేస్తూనే మరోవైపు జిహ్వచాపల్యానికి అనుగుణంగా కొత్త కొత్త రుచులపై మక్కువ చూపిస్తున్నారు. యువత సైతం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దాబా రెస్టారెంట్లు ప్రారంభిస్తున్నారు. చికెన్, మటన్, ప్రాన్ బిర్యానీలు, చేపలు, పీతలతో వివిధ రకాల వంటకాలు, తందూరి, మొగలాయ్, చైనీస్, చిల్లీచికెన్, లెమన్ చికెన్, చికెన్ కబాబ్, రేష్మీ కబాబ్, బాషా కబాబ్, అచారి చికెన్, తందూరి రోటీ, రుమాలీరోటీ, గార్లిక్ బటర్‌నాన్ వంటి అనేక రకాల డిష్‌లతో నోరూరిస్తున్నారు.



పోస్టల్ కాలనీ పార్కు వద్ద నూతనంగా ప్రారంభించిన మన్నత్ రెస్టారెంట్



ఏలూరు ఆర్‌ఆర్‌పేటలోని క్రిగో రెస్టారెంట్



ఏలూరు ప్రభుత్వాసుపత్రి రోడ్డులోని ఫుడ్ ఇంజినీర్స్ రెస్టారెంట్

కొత్త రుచులతో



నగరంలో సరికొత్త రుచులతో దాబారెస్టారెంట్లు అందుబాటులోకి వచ్చాయి. ఆహార ప్రియుల రుచులకు అనుగుణంగా రకరకాల వంటకాలు అందిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఏలూరు నగరం విస్తరిస్తున్న సందర్భంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. ఆహార పదార్థాలపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తికి అనుగుణంగా ప్రస్తుతం రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తున్నారు.

– కొప్పుల ప్రభాకర్‌రెడ్డి, ఏలూరు

ఆధునిక హంగులతో అందుబాటులోకి..



పెద్ద నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే రెస్టారెంట్లు నేడు ఏలూరు నగరంలో ప్రారంభించడం విశేషం. ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు కుటుంబ సమేతంగా, స్నేహితులతో సరదాగా కాసేపు గడుపుతూ వివిధ రకాల రుచులను ఆస్వాదించేలా దాబాలు నిర్మిస్తున్నారు. ఒకవైపు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తూనే మరోవైపు అనేక రకాల వంటకాలను పరిచయం చేస్తున్నారు.

– కె.హేమంత్‌కుమార్, ఏలూరు

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



తాము నేర్చుకున్న పేపర్ క్రాఫ్ట్ బొమ్మలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగుతోంది. గురువారం 18వ రోజున ప్రముఖ టీవీ యాంకర్ సోమ్లా నాయక్ ఒక అభ్యుదయ గీతం రాసి విద్యార్థులకు వినిపించడమే కాక వారితో పాడించి శిక్షణ ఇచ్చారు. అనంతరం డీ. శ్రీవల్లి విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ ద్వారా ఇంటిఅలంకరణ వస్తువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డ్యాన్స్‌మాస్టర్ కే. ఫణికాంత్ పాశ్చాత్య నృత్యాలను విద్యార్థులకు నేర్పారు. ఈ కార్యక్రమాలను ఉప గ్రంథపాలకుడు ఏ. నారాయణ రావు పర్యవేక్షించగా గ్రంథాలయ సిబ్బంది వీటీ సందీప్‌కుమార్, ఎండీ అస్లాం పాషా, బీవీఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

మోదీ పాలనపై ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తపన చౌదరి

ఏలూరు రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ 9 ఏళ్ల పాలన, పథకాలు గురించి బీజేపీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు వివరించాలని బీజేపీ ఏలూరు పార్లమెంటరీ కన్వీనర్ గారపాటి సీతారామాంచనేయచౌదరి (తపన చౌదరి) అన్నారు. గురువారం ఏలూరు కోటదిబ్బ వద్ద చాంబర్ ఆఫ్ మర్చంట్స్ మందిరంలో ఏలూరు జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తోందన్నారు. సమావేశంలో రేలంగి శ్రీదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు కురెళ్ల జ్యోతి, సుధాకర్ కృష్ణ, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి, అంబికా కృష్ణ రాష్ట్ర మహిళ మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయండి



ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: దెందులూరులో కాశీకాలనీలో రామాలయం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖాధికారులకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సూచించారు. కాశీకాలనీ నిర్వాసితులు రామాలయం నిర్మాణం అవశ్యకతను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం నాలుగు మండలాల నుంచి స్వయం ఉపాధి, రుణాలు, ఇళ్ల స్థలాలు, వ్యక్తిగత అవసరాలు, ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల ఉద్యోగులకు ఎమ్మెల్యే సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండే లాజర్ తదితరులు పాల్గొన్నారు.

75 మందికి కంటి వైద్యసేవలు

గణపవరం : వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గ్రామీణ ప్రాంతాలలోని వృద్ధులకు వరమని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని, కంటి సమస్యలనుంచి బయటపడాలని చిలకంపాడు సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటనారాయణ అన్నారు. గురువారం చిలకంపాడు గ్రామ సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యసహాయం పొందాలని, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని కనీసం వారానికి మూడుసార్లు ఆకుకూరలు తినాలని సీహెచ్‌వో జాలాది విల్సన్ సూచించారు. ఈసందర్భంగా 75 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు ఉచితంగా అందచేస్తామని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రి సెక్యూరిటీ పీఆర్‌ఓకు వేధింపులు



హస్పటల్‌లో వైద్యం పొందుతున్న ఎండీ షరీఫ్

ఏలూరు టౌన్ : ఏలూరు పెన్షన్‌లైన్‌కు చెందిన మహ్మద్ షరీఫ్ ఏలూరు సర్వజనాసుపత్రిలో సెక్యూరిటీ విభాగం పీఆర్‌ఓగా పనిచేస్తున్నాడు. హస్పటల్‌లో మహిళా సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో సరిగ్గా పని చేయడం లేదని పీఆర్‌ఓ షరీఫ్ ఆమెను మందలించాడు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో గురువారం ఉదయం మరోసారి హెచ్చరించి విధుల నుంచి ఇంటికెళ్లాలని చెప్పాడు.

అనంతరం పీఆర్‌ఓ షరీఫ్‌కు శానిటరీ విభాగానికి సంబంధించిన సంస్థప్రతినిధి ఫోన్ చేసి ఆమెను విధుల్లోకి తీసుకోవాలని చెప్పారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి ఒక అజ్ఞాత వ్యక్తి ఫోన్‌లో పీఆర్‌ఓ షరీఫ్‌ను బెదిరింపులకు పాల్పడ్డాడు. మహిళా సెక్యూరిటీ సిబ్బందిని లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్నావని, నీ సంగతి తేలుస్తామంటూ ఫోన్‌లో బెదిరించడంతో షరీఫ్ ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయినా అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి బెదిరిస్తూ ఉండటంతో తీవ్ర మానసిక వేదనకు గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతన్ని సర్వజనాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు నార్త్ సెక్షన్ పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలోని 33కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు శుక్రవారం చేయడానికి నిర్ణయించామని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పనులు మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు. దీంతో స్థానిక అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని రామచంద్రరావు పేట, విజయవిహార్ సెంటర్, రమా మహల్ సెంటర్, పోలీస్ క్వార్టర్స్, కలెక్టరేట్ కాంపౌండ్, కలెక్టరేట్ వెనకాల రోడ్డు, ఏటిగట్టు, కొత్త బస్టాండు ప్రాంతం, అశోక్ నగర్, పత్తేబాద, ఫైర్ స్టేషన్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. అలాగే వన్ టౌన్‌లోని కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నామని, దీంతో వన్‌టౌన్‌లోని మెయిన్ బజార్, అగ్రహారం, గజ్జలవారి చెరువు ప్రాంతం, గడియార స్తంభం ప్రాంతం, బావిశెట్టివారి పేట, నవాబ్ పేట, టీచర్స్ కాలనీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఏలూరు రూరల్ మండలంలోని 33/11 కేవీ చాటపర్రు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ పరివర్తకాల మరమ్మతులు చేపట్టనున్నామని వివరించారు. ఈ మేరకు మండలంలోని చాటపర్రు, మొండికోడు, మల్కాపురం, కొమడవోలు, కోటేశ్వర దుర్గాపురం, తిమ్మారావుగూడెం, మాధవపురం, బాబూఖాన్‌గూడెం, కొక్కిరాయిలంక, పెదయాగర్లమిల్లి, కోమటిలంక, గుడివాకలంక, ప్రత్తికోళ్ళ లంక పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

క్రిస్టియన్, మైనార్టీల అభివృద్ధికి కృషి



ఫాదర్‌బాలస్వామితో ప్రత్తిపాటి తంబి

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ వింగ్ సలహాదారు ఫాదర్ మద్దుల బాలస్వామి అన్నారు. ఏలూరుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది ప్రత్తిపాటి తంబి, ఏలూరుకు చెందిన న్యాయవాదులు యశ్వంత్, శ్రీకాంత్ తదితరులు గురువారం ఫాదర్ బాలస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ కోనా తంబి, ప్రత్తిపాటి విజయ్‌బాబు ఉన్నారు.

క్రమశిక్షణ, సమయపాలన అలవర్చుకోవాలి



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమడోలు : క్రమశిక్షణ, సమయపాలన విద్యార్థి దశ నుంచి అవలంభిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆర్మీ హవాల్దర్ యర్రంశెట్టి కృష్ణ కిషోర్ అన్నారు. భీమడోలు గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన చిన్నారులకు త్రివిధ దళాలపై అవగాహన కల్పించారు. దేశ రక్షణకు త్రివిధ దళాలు అనునిత్యం కంటికి రెప్పలా పనిచేస్తాయన్నారు. చిన్నతనం నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికనుగుణంగా సాధన చేస్తే విజయం సాధించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్, సత్యేంద్ర స్కూలు ప్రిన్సిపాల్ పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్ ఈతకోట భవ్యశ్రీ చిన్నారులకు నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లిషు తదితర అంశాలపై శిక్షణ అందించారు. పూళ్లలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులకు యోగా గురువు కురెళ్ల కిషోర్ ఆధ్యాత్మిక అంశాలపై శిక్షణ అందించారు. గుండుగొలనులో గ్రంథపాలకురాలు జి.నాగమణి చిన్నారులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం చేయించారు.

హోర్డింగులు, బోర్డుల తొలగింపు

భీమడోలు : రహదారి డివైడర్లపై అక్రమంగా ఏర్పాటు చేసిన హోర్డింగులు, ఐరన్ బోర్డులు, ఫ్లెక్సీలను రోడ్డు భవనాల శాఖ అధికారులు తొలగించారు. భీమడోలు జంక్షన్ నుంచి ద్వారకాతిరుమల వరకు రోడ్డు డివైడర్లలో మొక్కలను నాటి సుందరంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టారు. అయితే రాజకీయ నాయకులు, వ్యాపార సంస్థలు ప్రచారానికి వేదికలుగా డివైడర్లలో హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఐరన్ బోర్డులను ఏర్పాటు చేసుకున్నారు. దీని వల్ల అధికారులు నిర్దేశించిన లక్ష్యం నెరవేరడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ డివైడర్లపై అక్రమంగా ఎటువంటి బోర్డులు, హోర్డింగులు ఉండరాదని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో భీమడోలు ఆర్‌అండ్‌బీ ఏఈ జె.భాస్కరరావు ఆధ్వర్యంలో రెండు రోజులుగా జేసీబీలు, కూలీలతో డివైడర్లలోని ఏర్పాటు చేసిన వాటిని తొలగించారు. సుమారు 16 కిలోమీటర్లలో 97 బోర్డులను తొలగించామని ఏఈ పేర్కొన్నారు.

ఖైదీలకు న్యాయ సహాయం



ఏలూరులో జిల్లా కారాగారాన్ని సందర్శించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు రూరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి రాజేశ్వరి గురువారం ఏలూరులో జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కారాగాయంలో అందిస్తున్న ఆహారం, తాగునీరుతో పాటు మౌలిక వసతులను పరిశీలించారు. ఖైదీల కేసు వివరాలు, వారి ప్రవర్తనతో పాటు పొందుతున్న న్యాయ సహాయం గురించి కారాగార అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మట్లాడుతూ ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అవసరమైన పక్షంలో న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు పొందడంలో సహకరిస్తామన్నారు. ఆమె వెంట చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు మునేశ్వరరావు, జిల్లా జైలర్ వెంకటరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

స్పందన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

పెదపాడు: మండలంలోని వట్లూరుకు ఓ మహిళకు బోగాపురం రహదారి నిర్మాణంలో భాగంగా నష్టపరిహారం అందించలేదని స్పందనలో ఫిర్యాదు చేసింది. దీంతో పెదపాడు తహసీల్దార్ వట్లూరు వీఆర్వో కార్యాలయాన్ని సందర్శించారు. సంబంధిత ఫిర్యాదుకు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పందన ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం చూపాలని తమ పరిధిలో లేకుండా సంబంధిత వివరాలను ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఆర్ఏఎస్ఆర్ చంద్రమూర్తి, దామరాజు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తికి గాయాలు

పెదపాడు: మండలంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలు కావడంతో పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని కలపర్రు గ్రామానికి చెందిన నూకల వెంకట రామచంద్రరావు కలపర్రు గ్రామంలో రహదారిపై సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని మోటారు సైకిల్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	52
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05-08
బెండకాయలు	16	కంద	52
పచ్చిమిర్చి	40-48	బీట్‌రూట్	34
కాకర కాయలు	44	కీరా దోస	40
బీరకాయలు	20	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	44	అల్లం	220
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	14	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	86
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	25
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	20

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	08
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	36
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	36
ఏలూరు -తిరుపతి	16.00	4830	31